
# హజ్ పరమార్థం



Hajj Kis Liye?
(Telugu)

# హజ్ పరమార్థం


మూలం:

**షమ్స్ పీర్‌జాదహ్**

అనువాదం:

**ఎస్.ఎ. ఆదిల్**



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్** (రిజిష్టర్డ్)

సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,

హైదరాబాద్-500 002. ✆ :24564583

**Hajj Paramaardham**

Hajj Kis Liye? (Telugu)

**TIP Series No. 133**

Written by : Shams Peerzaadah

Translated by : S.A. Adil

All Rights Reserved with Publishers

2nd Edition : December 2012

Copies : 2000

**Price : Rs.10**

ISBN : 81 - 88241 - 28 - 8

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com
website: www.teluguislamiclit.org

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# హజ్ పరమార్థం

హజ్ అంటే దైవసన్నిధికి చేరుకోవడం. దైవసన్నిధిలో హాజరయ్యేందుకు ఇహ్రామ్ (దీక్ష) బూనిన ప్రతి వ్యక్తీ ఈ మాటలు వల్లెవేస్తూ ఉంటాడు.

**లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్-లబ్బైక్ లా షరీక లక**
**లబ్బైక్- ఇన్నల్ హమ్‌ద వన్నీమత లక- వల్**
**ముల్‌క లాషరీక లక.**

**హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను. సాటిలేని స్వామీ! నేను (నీ సేవకై) హాజరయ్యాను. నిస్సందేహంగా స్తోత్రం నీకే తగును. అనుగ్రహాలన్నీ నీ ప్రసాదితాలే. సార్వభౌమత్వం కూడా నీదే. నీకు సహవర్తులెవ్వరూ లేరు. (బుఖారి)**

ఈ విధంగా 'లబ్బైక్' అని పలకడం వాస్తవానికి దేవుని పిలుపునకు సమాధానమివ్వటమే. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) కాబా (దైవగృహ) నిర్మాణం పూర్తిచేసిన తరువాత ఆయనను హజ్ చేయమని అల్లాహ్ ఆజ్ఞాపించాడు.

**హజ్ కొరకు మానవులందరినీ పిలుపు. వారు నీ వద్దకు దూర దూర ప్రాంతాల నుండి కాలినడకతోనూ, ఒంటెలు ఎక్కి రావాలని.**
**(అల్ హజ్ -27)**

ఇబ్రాహీం (అలై) గారి ఈ పిలుపునకు సమాధానంగా నలువైపుల నుండి 'లబ్బైక్-లబ్బైక్' అన్న సమాధానం ఇవ్వబడుతుంది. వాతావరణమంతా ఆధ్యాత్మిక రంగులో రంగరించబడుతుంది. ఇలా ఏర్పడిన వాతావరణంలో మానవులతోపాటు చెట్లూ-చేమలూ, రాళ్ళూ-రప్పలూ సయితం శృతి కలుపుతున్నట్లుగా గోచరిస్తుంది.

హజ్రత్ సుహైల్ బిన్ సాద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు:

> **ఒక విశ్వాసి 'లబ్బైక్' అని పలికినప్పుడు అతని చుట్టుప్రక్కల ఉన్న వాతావరణమంతా, రాళ్ళూ-రప్పలూ, చెట్లూ-చేమలూ అన్నీ 'లబ్బైక్' అంటూ ఉంటాయి. చివరకు భూమండలమంతా ఈ నినాదంతో మార్మోగిపోతుంది.**

ఈ విధంగా మీరు లబ్బైక్ అంటూ, పరిసరాలన్నిటినీ ఆధ్యాత్మిక రంగులో రంగరిస్తూ విశ్వప్రభువు దర్బారులో హాజరవుతారు. దైవగృహాన్ని సందర్శించటం, ఆయన దర్బారుకు హాజరవటం నిజంగా మీకు లభించిన భాగ్యమే. ఇలాంటి దైవదర్బారు నుండి వట్టిచేతులతో తిరిగొచ్చేవారిని పరమ దౌర్భాగ్యులని కాకుండా మరేం అనగలం? కౌసర్, తస్నీమ్ సెలయేరులు పొంగిపొర్లే ఈ దర్బారులో దప్పిక తీర్చుకోలేనివారు అవివేకులు. హజ్ చేసిన తరువాత కూడా మానవ జీవితాశయాన్ని తెలుసుకోకపోవడం, దైవప్రసన్నత కోసం కృషి చేయకపోవడం, ధర్మసంస్థాపనను జీవన ధ్యేయంగా చేసుకోకపోవడం, దైవాన్ని సరైన విధంగా ఆరాధించకపోవడం, వ్యాపార లావాదేవీలలో ధర్మాధర్మాల విచక్షణ పాటించకపోవడం, దైవాదేశాలను విస్మరించడం, ప్రాపంచిక వ్యామోహంలో కూరుకుపోవడం వగైరా చెడులకు పాల్పడేవారు దైవానుగ్రహాలను ఏ విధంగా పొందగలుగుతారో మీరే చెప్పండి. అల్లాహ్ పరమ కరుణామయుడు. ఆయన కరుణాకటాక్షాలు అపారమైనవి. ప్రతి ఒక్కరి విన్నపాలను ఆయన స్వీకరిస్తాడు. అపార అనుగ్రహాలను ప్రసాదిస్తాడు. హజ్రత్ ఈసా (అలై)గారి ఈ వ్యాఖ్యను చూడండి:

> **అడగండి, మీకు ప్రసాదించబడుతుంది. అన్వేషించండి, మీకు లభిస్తుంది. తలుపు తట్టండి, అది మీ కోసం తెరవబడుతుంది. మీ కుమారుడు మిమ్మల్ని రొట్టె అడిగితే, మీరు అతనికి రాళ్ళు ఇస్తారా? చేపనడిగితే పామునిస్తారా? మీరు చెడ్డవారైనప్పటికీ మీ పిల్లలకు మంచిని ఇవ్వదలచుకున్నప్పుడు ...అనంత ఆకాశాలపై ఆసీనులైన మీ ప్రభువు మీకు మంచిని ప్రసాదించడా... (మత్తయి, ప్రకరణం-7)**

వాస్తవమేమిటంటే, దైవానుగ్రహాలు లభించకపోవడానికి బాధ్యులు వీరే. దేవుని దర్బారు నుండి ప్రయోజనం పొందాలంటే మన హృదయం దేవుని వైపు మరలేదయి, దేవుని పట్ల భయపడేదయి ఉండాలి. దేవుని వైపు మరలకుండా అశ్రద్ధ వహించేవాడు, దైవభీతి లేనివాడు అనుగ్రహాలు ఎలా పొందగలుగుతాడు? పవిత్రమైన, ఆశయబద్ధమైన జీవితం గడిపేందుకు, ఇహలోక ప్రయోజనాలకన్నా పరలోక ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేందుకు ముందుకు వచ్చేవారికే ఆ దైవానుగ్రహాలు ప్రసాదించబడతాయి. అలాంటివారు హజ్‌ను ఒక సత్కార్యమని భావించి నెరవేర్చుతారు. కాని ధర్మం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు హజ్ నియమాలను ఏదో మొక్కుబడి కోసం అన్నట్లు యాంత్రికంగా పాటిస్తారు. ఒక్కోసారి ఈ పవిత్రమైన యాత్ర కేవలం విహారయాత్రగా మారడం కూడా జరుగుతుంది. ఇది అతిశయోక్తితో కూడిన మాట కాదు. ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

హజ్ యాత్ర ముగించుకుని తిరిగి వచ్చేటప్పుడు విమానంలో కూర్చొని రేడియోలో పాటలు వినేవారు లేరా? అందులోని సంగీతం, స్త్రీల కంఠస్వరం పట్ల ఆకర్షితులయ్యేవారు లేరా? అప్పుడే అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం నుండి అత్యున్నత శిక్షణ పొంది తిరిగొచ్చేవారి ప్రవర్తన ఇలాగే ఉంటుందా? ఈ ధోరణి చూస్తుంటే హజ్ ఆచారాలన్నీ పాటించి ఇహ్రామ్ (దీక్ష) విరమించగానే దాంతోపాటు సత్కార్యాలను కూడా వదిలేస్తారా? అనిపిస్తుంది ఒక్కోసారి. అందువల్లే దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ హజ్ యాత్ర చేసేవారికి దైవభీతిపరాయణులయి తిరిగిరావాలని తాకీదు చేశాడు.

**హజ్ యాత్రకు ప్రయాణ సామగ్రిని తీసుకువెళ్ళండి. భయభక్తులు అన్నింటికంటే ఉత్తమమైన సామగ్రి. (అల్ బఖర-197)**

## దైవభీతి (తఖ్వా)

దైవభీతి ఆరాధనకు ప్రాణం లాంటిది. దైవభీతిలేని ఆరాధనలు నిజమైన ఆరాధనలుగా పరిగణించబడవు, దైవసన్నిధిలో అవి స్వీకారయోగ్యం

కూడా కాలేవు. దైవప్రవక్త ఆదమ్ (అలై) కుమారుడైన ఖాబిల్‌లో దైవభీతి లేనందునే అతనిచ్చిన ఖుర్బానీని దేవుడు స్వీకరించలేదు.

**భయభక్తులు గలవారి మొక్కుబడులనే అల్లాహ్ స్వీకరిస్తాడు. (అల్ మాయిద-27)**

తఖ్వా (దైవభీతి) అంటే యాంత్రికమైన లేదా ప్రదర్శనాపూరితమైన ధర్మపరాయణత ఎంతమాత్రం కాదు. తఖ్వా అంటే దాసునిపై దైవభీతి ఆవహించే ఒక విధమైన పరిస్థితి. ఈ పరిస్థితే అతని చేత దైవాదేశాలను పాటింపజేస్తుంది. అవిధేయతా ధోరణికి ఒడిగట్టకుండా అతడ్ని నిరోధిస్తుంది. ఈ దైవభీతి మనిషి హృదయంలో జనించి అతని నరనరాలలో వ్యాపిస్తుంది. హజ్జతుల్‌విదా (చివరి హజ్) సందర్భంలో మహాప్రవక్త (సఅసం) ఈ వాస్తవాన్ని మరింత విడమరచి చెప్పారు.

**ఆయన (సఅసం) తన హృదయం వైపు చూపిస్తూ 'దైవభీతి ఇక్కడే ఉంటుంది' అని మూడు సార్లు అన్నారు. (ముస్లిం)**

దైవభీతి గనక హృదయంలో చోటుచేసుకుంటే దాని ప్రభావం యావత్తు అవయవాల ద్వారా బహిర్గతమవుతుంది. అలాంటి మనిషి ఎల్ల వేళలా జీవితంలోని ప్రతి రంగంలోనూ దైవాదేశాలకు కట్టుబడి ఉంటాడు. దైవనిర్ణీత హద్దులను ఏమాత్రం ఉల్లంఘించడు. అవిధేయతా వైఖరికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉంటాడు. ముండ్లపొదల మధ్య నడిచే మనిషి జాగ్రత్తగా అడుగులు వేస్తూ ముండ్ల నుండి తనను ఏ విధంగా కాపాడు కుంటాడో అదే విధంగా దైవభీతిపరాయణుడు కూడా అవిధేయతా ముండ్ల నుండి తనను కాపాడుకుంటాడు. చెడ్డ పనులు అనే ముండ్ల బారిన పడ కుండా జాగ్రత్త పడుతూ తిన్నని మార్గం వైపునకు అప్రతిహతంగా పురోగ మిస్తాడు.

ఈ అంతర్గత దైవభీతి మనిషి ఆలోచనా జగత్తును సమూలంగా మార్చివేస్తుంది. అతని బుద్ధికౌశల్యాన్ని వికసింపజేసి విజ్ఞతా వివేచనలను ప్రసాదిస్తుంది. అతని నైతిక, క్రియాజీవితాన్ని మెరుగుపరుస్తుంది. హజ్

మొదలైన ఆరాధనలలో కూడా దైవభీతిని వికసింపజేసే సాధనాలు ఉన్నాయి. అయితే హృదయంలో దైవభీతి లేకపోతే మనం చేసే సత్కర్మలన్నీ కేవలం మొక్కుబడి కర్మలుగా మాత్రమే ఉండిపోతాయి. హృదయంలో దైవభీతి ఉండి చేసిన సత్కర్మలు మాత్రమే దేవుని దృష్టిలో విలువయినవిగా పరిగణించబడతాయి. దైవచిహ్నాలలో ఒకటైన ఖుర్బానీ (బలిదానం) అంటే కేవలం ఖుర్బానీ నియమాలు పాటించడం కాదు, ఖుర్బానీ అసలు లక్ష్యం త్యాగభావం. త్యాగభావంలేని బలిదానం నిరర్థకం. దీన్ని గురించి దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

> **వాటి మాంసము అల్లాహ్‌కు చేరదు. వాటి రక్తమూ అల్లాహ్‌కు చేరదు. కాని మీ భయభక్తులు మాత్రమే అల్లాహ్‌కు చేరుతాయి. (హజ్-37)**

కనుక అలవాటుగానో లేదా మొక్కుబడిగానో చేసే ఆరాధనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అదే విధమైన హజ్ యాత్ర వల్ల కూడా మనిషి ఎలాంటి పుణ్యఫలం ఆశించలేడు.

## హజ్జె మబ్రూర్

హజ్జె మబ్రూర్ అంటే సత్సంకల్పంతో, నిష్కల్మషమైన హృదయంతో పూర్తి నియమాలు పాటిస్తూ చేసే హజ్ అన్నమాట. బుఖారీలోని ఒక హదీసులో హజ్జె మబ్రూర్‌ను అత్యుత్తమ ఆచరణగా పరిగణించడం జరిగింది.

> **హజ్రత్ అబూహురైరా ఉల్లేఖనం ప్రకారం, మహాప్రవక్త (సఅసం)ను 'అత్యుత్తమ ఆచరణ ఏది' అని ప్రశ్నించటం జరిగింది. అందుకు మహాప్రవక్త (సఅసం) 'అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించటం' అని సమాధానమిచ్చారు. 'ఆ తరువాత ఏది' అని మరల ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన, 'దైవమార్గంలో పోరాడటం (జిహాద్ చేయటం)' అని అన్నారు. మరల 'దాని తరువాత ఏది' అని అడుగగా, అందుకు ఆయన (సఅసం) 'హజ్జె మబ్రూర్' అని సమాధానమిచ్చారు. (బుఖారీ-హజ్ ప్రకరణం)**

సాధారణంగా అనువాదకులు హజ్జె మబ్రూర్ అంటే ఆమోదయోగ్య మైన హజ్ అని అనువదిస్తున్నారు. కాని దాని వల్ల పూర్తి అర్థం స్ఫురించదు. శాస్త్రప్రకారం భయభక్తులతో, పూర్తి నియమాలతో ఏ విధంగా నిర్వహించాలో ఆ విధంగా హజ్ నిర్వహించాలి అనే భావం హజ్జె మబ్రూర్‌లో ఉంది.

హజ్జె మబ్రూర్ గురించి వ్యాఖ్యానిస్తూ అల్లామా ఖుర్తుబీ (రహ్మాలై) ఇలా అంటున్నారు:

**హజ్జె మబ్రూర్ అంటే ఆచరణాత్మకంగా పూర్తిగా నెరవేర్చబడిన హజ్. హజ్ చేయమని ఏ విధంగా కోరబడిందో తు.చ. తప్పకుండా ఆ విధంగా చేయబడిన హజ్. (ఫత్‌హుల్ బారి-మూడవ భాగం-పేజి.298)**

పై వ్యాఖ్యానం ద్వారా తేటతెల్లమయ్యే విషయమేమిటంటే, హజ్జె మబ్రూర్ అంటే అంతర్ బాహ్య షరతులను, నియమ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ నెరవేర్చబడిన హజ్ అన్నమాట. ఈ హజ్ ప్రత్యేకతేమిటంటే, ఇందులో ఏకదైవోపాసన, చిత్తశుద్ధి, దైవప్రసన్నత, దైవం వైపు మరలటం, దైవభీతి పరాయణతలు కలిగి ఉండటం, ధర్మస్థాపన కోసం కృషి చేయటం, సేవా త్యాగ భావాలను పురిగొల్పటం, హజ్ ఆచరణలు పూర్తిగా నెరవేర్చడాలు కలసి ఉన్నాయి. ఈ విధంగా చేసిన హజ్జే దైవానికి ప్రీతికరమైన హజ్, ఆమోదయోగ్యమైన హజ్ కూడానూ.

## ఇహ్రామ్

దేవుని దర్బారులో హాజరయ్యేందుకు ఇహ్రామ్‌కు సంబంధించిన ఎన్నో నిబంధనలను మీరు పాటించవలసివస్తుంది. మీరు కుట్టు వస్త్రాలు ధరించ లేరు. టోపీలూ, సాక్సులూ ధరించలేరు. సువాసన పూసుకోలేరు. తల దువ్వుకో లేరు. వెంట్రుకలు-గోళ్ళు కత్తిరించలేరు. భార్యతో (కామ) సంబంధాలు పెట్టుకోలేరు. సాధారణ పరిస్థితుల్లో పై విషయాలు ధర్మసమ్మతమే. కేవలం ఇహ్రామ్ మూలంగా ఇవి నిషేధించబడ్డాయి. ఇహ్రామ్ కోసం ఎంపిక చేయ బడిన దుస్తులు అతి సాధారణమైనవి. ఒక లుంగీ, ఒక దుప్పటి మాత్రమే ఇహ్రామ్ కోసం నిర్ణయించబడ్డాయి. రాజైనా, రైతైనా ఈ వస్త్రాలతోనే దైవ

దర్బారులో హాజరుకావాల్సి ఉంటుంది. దీని మూలంగా ఇస్లాంలో ఉన్న సమతాభావం గోచరిస్తుంది. దైవదర్బారుకు హాజరయ్యే మనిషి దేవుని ఔన్నత్యాన్ని గుర్తిస్తూ, ఆయనకు వినయవిధేయతలు చూపుతూ రావాలన్నదే దీని ఉద్దేశ్యం.

ప్రాపంచిక ఆడంబరాలను, భోగభాగ్యాలను ఇస్లాం నిషేధించలేదు. అయితే మనిషి ఎల్లప్పుడూ ఒకే పరిస్థితిలో ఉన్నప్పుడు అతని దృష్టి మరో విషయం వైపునకు పోదు. ఈ ఆడంబరాలు, తళుకుబెళుకులు జీవిత సత్యాలను, ఆధ్యాత్మిక విలువలను గురించి ఆలోచింపనీయవు. అందువల్ల ఆధ్యాత్మిక విలువల వైపు దృష్టి మళ్ళించడానికి ఇస్లాం ధర్మసమ్మతమైన విషయాలను కూడా ప్రత్యేక పరిస్థితుల్లో నిషేధితాలుగా పరిగణిస్తుంది.◆ దీనికి హజ్, ఉపవాసాలు చక్కని ఉదాహరణలు. ఈ కారణంగా విశ్వాసి ఇహ్రామ్ స్థితిలో ఉన్నప్పుడు ఆధ్యాత్మికంగా ఓ విచిత్రానుభూతికి లోనయి వీలైనంత ఎక్కువ ఆధ్యాత్మిక భావనామృతాన్ని ఆస్వాదిస్తాడు. మరో మాటలో చెప్పాలంటే, అతను ఆధ్యాత్మిక వికాస మజిలీలను దాటుకుంటూ దైవ ప్రసన్నత పొందడానికి కృషి చేస్తాడు. కనుక ఇహ్రామ్ (దీక్ష) అంటే ఓ ప్రత్యేక వస్త్రధారణకు మారుపేరు కాదు. తాను విశ్వస్వామాట్టు కొలువుకు హాజరవుతున్నానన్న భావన అతడ్ని ఆవహిస్తుంది. ఈ భావన విశ్వాసిలో అణుకువ, వినయవిధేయతలను జనింపజేస్తుంది. దేవుని పట్ల హృదయంలో అణుకువ, వినయవిధేయతలు కలిగివున్న మనిషి ఏమాత్రం అహంకారానికి లోనవకుండా ఎల్లప్పుడూ విశ్వసనీయుడైన దాసునిగా, ఎంతో వినయం, అణుకువలుగల బానిసగా జీవితం గడుపుతాడు.

---

◆ ఇస్లాం ఇహలోక జీవనాన్ని త్యజించడాన్ని నిషేధించింది. నిరాడంబరంగా జీవించమని ఆదేశించింది. కాని కొన్ని ప్రత్యేక సందర్భాలలో తాను చేయమని చెప్పిన కొన్ని విషయాలపై నిషేధాన్ని ప్రకటించింది. దీని ద్వారా తేటతెల్లమయ్యే విషయమేమిటంటే, వైరాగ్య జీవితానికి, ప్రాపంచిక వ్యామోహానికి మధ్యగల మార్గాన్నే జీవనపథంగా ఎంచుకోవాలని ఇస్లాం చెబుతుంది.

# దైవగృహం (బైతుల్లాహ్)

హజ్ యాత్ర కోసం నిర్దేశించబడిన నియమాలు ఇస్లామీయ చరిత్ర పుటల్లోని ప్రధాన సంఘటనలన్నింటినీ మాటిమాటికి గుర్తుచేస్తాయి. ఈ నియమాలు పాటిస్తున్నప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) గారి అత్యున్నత సుగుణసంపత్తితో కూడిన అద్భుత వ్యక్తిత్వం మన కళ్ళముందు మెదలుతుంది. ఆనాటి బహుదైవారాధక వాతావరణంలో ఆయన విగ్రహారాధనను ఖండిస్తూ ఏకేశ్వర నినాదమిచ్చారు. తన తండ్రికి కూడా ఏకదైవోపాసన గురించి బోధించారు. చక్రవర్తి నమ్రూద్‌ని కూడా ఏకేశ్వరోపాసన వైపునకు పిలిచే సాహసం చేశారు. ఈ నేరానికి శిక్షగా చక్రవర్తి ఆయన్ని అగ్నిగుండంలో పడవేయించాడు. అయితే దేవుడు ఆ మహనీయుడ్ని రక్షించాడు.

ఇబ్రాహీమ్ (అలై) కోసం మండించిన అగ్నిగుండాన్ని అల్లాహ్ చల్లార్చి ఆయన్ని కాపాడినప్పటికీ తండ్రి పోరు తగ్గలేదు. అతను హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై)ని ఇల్లు వదలి వేరే ప్రాంతానికి వలస (హిజ్రత్) పోయేలా బలవంతం చేశాడు. ఆ కష్టాన్ని కూడా హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) సహించారు. ఈ విధంగా ఆయన దేశప్రేమ కంటే దైవప్రేమే గొప్ప విషయమని ఆచరణాత్మకంగా నిరూపించారు. హిజ్రత్ అనంతరం అల్లాహ్ ఆయన (అలై)కు మక్కా నగరం వైపు దారి చూపారు. ఒక్క చెట్టుగాని, నీటిచుక్కగాని లేని ఆ నిర్జన ఎడారి ప్రాంతంలో ఆయన తన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలై)ని (అల్లాహ్ ఆజ్ఞ మేరకు) విడిచివెళ్ళారు. తర్వాత కొంతకాలానికి ఆయన తన కుమారునితో కలసి దైవాజ్ఞతో కాబాగృహాన్ని నిర్మించారు. ఇదే అంతర్జాతీయ ఏకేశ్వరోపాసనా కేంద్రంగా, ప్రబోధనా నిలయంగా వాసికెక్కింది.

> **ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనా గృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ యొక్క ప్రార్థనాస్థలం ఉంది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు.**
> **(ఆలి ఇమ్రాన్-96)**

ఏకేశ్వరోపాసనా ప్రకటనకు, బహుదైవారాధనా ఖండనకు కాబాగృహం ప్రబల నిదర్శనం. ఏకేశ్వరోపాసన అంటే అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడని, ఆయన గుణగణాలలో, శక్తిసామర్థ్యాలలో, అధికారాలలో మరెవరూ ఆయనకు సాటిలేరని అర్థం. ఆయనే సృష్టికర్త, ప్రభువు, పాలకుడు, పూజాపురస్కారాలకు ఆయన మాత్రమే అర్హుడు. లాభనష్టాలన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయి. అదృష్ట, దురదృష్టాలు కూడా ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆపదమొక్కులవాడు, అవసరాలు తీర్చేవాడు కూడా ఆయనే. కనుక సహాయం కోసం ఆయన్ని మాత్రమే అర్థించాలి. ఆజ్ఞలు జారీచేయడం, చట్టాలు నిర్మించడం ఆయనకే చెల్లుతుంది. ఆయన ఆజ్ఞలను, చట్టాలను తు.చ. తప్పకుండా పాటించడం మన విధ్యుక్త ధర్మం. మనం ఆయన్ని మాత్రమే ఆరాధించాలి. యావన్మంది విధేయతలకంటే ఆయన విధేయతకే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. ఇతరులకంటే ఆయనకే మనం ఎక్కువ విశ్వాసపాత్రులమై ఉండాలి.

కాబట్టి దైవగృహాన్ని సందర్శించేటప్పుడు మనం అల్లాహ్ పట్ల నిజమైన భక్తివిశ్వాసాలు కలిగి ఉన్నామో లేదో ఆత్మావలోకనం చేసుకోవాలి. ఏకదైవోపాసనకు ఎంత వరకు కట్టుబడి ఉన్నామో పరిశీలించుకోవాలి. మనం ఆచరిస్తున్న ఏకదైవోపాసనలో బహుదైవారాధనా దుర్గంధం ఏమైనా ఉందేమో చూసుకోవాలి. అవసరాలు, కష్టాలు తీర్చమని మనం అల్లాహ్‌తోపాటు దైవప్రియుల్ని కూడా వేడుకుంటున్నామేమో ఆలోచించాలి. అల్లాహ్ సన్నిధిలో కాకుండా మహనీయుల సమాధుల దగ్గర కానుకలేమైనా సమర్పించుకుంటున్నామేమో, మొక్కుబడులేమైనా తీర్చుకుంటున్నామేమో అని కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. మన విశ్వాస, ఆచరణల్లో వీటిలో ఏ ఒక్కటి ఉన్నా అది ఏకేశ్వరోపాసనా భావానికి వ్యతిరేకమవుతుంది. దాన్ని వెంటనే సంస్కరించుకోవాలి. స్వచ్ఛమైన ఏకేశ్వరోపాసనే హజ్ యాత్రకు ప్రాతిపదిక. ఇది లోపిస్తే మన హజ్ యాత్ర అర్థరహితంగా ఉండిపోతుంది.

కాబాగృహం ఇస్లామీయ చరిత్రకు సంబంధించిన ప్రముఖ స్మారక చిహ్నం. పునాదిరాయి లాంటిది. ఇది మరువలేని చిహ్నం కూడానూ. దాని

నిర్మాత హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) ఇస్లాం ధర్మమే అవలంబించారు. ఆయన కూడా ముస్లిమే, దైవవిధేయుడే. ఇస్లాం అనుచర సమాజానికి పునాదులు వేసిన పితామహుడు ఆయనే. యూద, క్రైస్తవ మతాలు ఆయన నిష్క్రమణ తరువాత ఇస్లాం నుండి పెడదారిపట్టి ఎన్నో మార్పులుచేర్పులకు గురయి ఉనికిలోకి వచ్చాయి. అదేవిధంగా బహుదైవారాధనకు సంబంధించిన మతాలు కూడా మానవుల స్వకల్పితాలే. మానవులకు రుజుమార్గం చూపడానికి సృష్టికర్త నిర్దేశించిన ధర్మం అనాది నుండి ఇస్లాం మాత్రమే. దేవునికి ఇష్టమైనది, అమోదయోగ్యమైనది కూడా ఇస్లాం ధర్మమే. యావత్తు దైవప్రవక్తలు అవలంబించిన, ప్రచారం చేసిన ధర్మం కూడా ఇస్లామే.

**అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం ఇస్లాం మాత్రమే. (ఆలి ఇమ్రాన్-19)**

**ఎవడైనా ఈ విధేయతా విధానాన్ని (ఇస్లాం) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే, ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు.**

**(ఆలి ఇమ్రాన్-85)**

ఈ యదార్థాన్ని దృష్టిలో ఉంచుకుంటే, "మతాలన్నీ ఒక్కటే, సత్యమైనవే, నదులన్నీ చివరికి సముద్రంలో కలసినట్లు ఏ మతం అనుసరించినా దేవుని సన్నిధికి చేరుకోవచ్చు" అన్న సిద్ధాంతం పూర్తిగా తప్పని తేలిపోతుంది. ఇది మనిషిని రుజుమార్గం నుండి తప్పించి వక్రమార్గాలకు గొనిపోయే తప్పుడు సిద్ధాంతం. ఏ విధంగా రెండు బిందువుల మధ్య దగ్గరి దూరం ఒక్క సరళరేఖకు మాత్రమే అవకాశముంటుందో అదేవిధంగా దైవాన్ని చేరుకునేందుకు రుజు మార్గం ఒక్కటే ఉంటుంది. ఆ రుజుమార్గమే ఇస్లాం. అందువల్ల హజ్ యాత్రికులు కాబా నిర్మాత హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై), అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) జీవిత విధానాలను, వారి సంప్రదాయాలను మాత్రమే మార్గదర్శకంగా తీసుకోవాలి. ఇస్లామే సత్యధర్మమని, అదే మోక్షాన్ని ప్రసాదిస్తుందని ప్రజలకు చాటిచెప్పాలి.

# తవాఫ్

మీరు దైవగృహం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. అసలు ప్రదక్షిణ అంటే ఏమిటి? దైవప్రసన్నత కోసం అమితమైన భక్తివిశ్వాసాలతో కాబాగృహం చుట్టూ ప్రదక్షిణ చేయటమే అసలైన ప్రదక్షిణ (తవాఫ్). ఈ విధంగా చేయటం ద్వారా దైవంతో మీకున్న సంబంధం బూటకపు సంబంధం కాదని, అది మానసిక సంబంధమని నిరూపించుకుంటారు. దైవంతో మీకున్న ఈ ప్రగాఢ సంబంధం కారణంగానే మీరు ఆయన్ని ఆశ్రయకర్తగా తలుస్తారు; ఆయన పవిత్ర నామాన్ని స్తుతిస్తారు; ఆయన ప్రసన్నత కోసం తహతహలాడతారు; ఆయన సాన్నిధ్యం పొందడమే తమ జీవితధ్యేయంగా భావిస్తారు; ఆయనకు సంబంధించిన వ్యవహారాలే సదా మీ మదిలో మెదలుతుంటాయి; ఆయన నిర్దేశించిన ధర్మమే మీ జీవిత సంవిధానమయి ఉంటుంది; మీరు పూర్తిగా విధేయులై ఆయన్ని ప్రాణప్రదంగా ఆరాధించగోరుతారు. కాబా ప్రదక్షిణ చేస్తూ రుకునె యమానీ, హజ్రె అస్వద్‌ల మధ్యకు చేరుకున్నప్పుడు మీరీ విధంగా దైవాన్ని వేడుకుంటారు.◆

**రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతవ్ వ్వఫిల్ ఆఖిరతి**

**హసనతవ్ వ్వఖినా అజాబన్నార్.**

**ప్రభూ! ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మాకు మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకబాధ నుండి కాపాడు. (అల్ బఖర-201)**

ఈ ప్రార్థన ద్వారా మీరు ఇహలోక శ్రేయస్సుతోపాటు పరలోక సాఫల్యాన్ని, నరకయాతన నుండి రక్షణను అర్థించి, ఐహిక సౌఖ్యాలు,

---

◆ యమానీ రుకున్, హజ్రె అస్వద్‌ల మధ్య మహాప్రవక్త (సఅసం) రబ్బనా ఆతినా... అనే దుఆ పఠించారని హదీసులు ఉన్నాయి. తవాఫ్ చేసే సమయంలో వేరే 'దుఆ'లు కూడా పఠించవచ్చు. కాని ఇలా పఠించడం తప్పనిసరి కాదు. మీకు గుర్తున్న దుఆలలో దేనినైనా పఠించవచ్చు. ఈ విధంగా మీరు దుఆ చేస్తూ, దుఆ పదాలపై మనసు లగ్నం చేయకుండా దైవంపై దృష్టి సారిస్తే బాగుంటుంది.

సిరిసంపదలే సర్వస్వం అనుకునే పదార్థపూజారుల నుండి వేరయిపోతారు. పదార్థపూజారుల మస్తిష్కాలలో పరలోకభావన మచ్చుకైనా ఉండదు. ఒకవేళ వారు ఎప్పుడైనా దైవాన్ని వేడుకున్నా ప్రాపంచిక సంపదలే ప్రసాదించమని వేడుకుంటారు. ఇలాంటివారిని గురించి దివ్య ఖుర్ఆన్‌లో దేవుడు ఇలా పేర్కొంటున్నాడు:

> **మనుషులలో కొందరు తమ ప్రభువును వేడుకుంటూ, 'మా ప్రభూ! మాకు ఈ లోకంలోనే అన్నీ ప్రసాదించు' అని ప్రార్థిస్తారు. ఇలాంటి వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. (అల్ బఖర-200)**

ప్రాపంచిక జీవితంలో పరలోక అనుగ్రహాలకు విలువనిస్తూ వాటి కోసం దైవాన్ని అర్థించేవారే వాటిని పొందడానికి అర్హులవుతారు. పరలోక అనుగ్రహాలకు విలువనివ్వని, వాటి కోసం దైవాన్ని అర్థించని దాసులు వాటిని పొందడానికి ఎలా అర్హులవుతారు? అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఒక వస్తువును పొందాలన్న కోరిక ఉన్నవాడు దాని విలువను కూడా గుర్తించినప్పుడు ఆ విలువను తన ప్రవర్తన ద్వారా నిరూపించాలి.

మీరు మంచిని కోరుకుంటుంటే మీ వైఖరి కూడా మంచిగానే ఉండాలి. హజ్ సందర్భంగా తవాఫ్ చేసేటప్పుడు, ఇతర ఆచారాలు పాటిస్తున్నప్పుడు మీ వైఖరిలో ఎలాంటి చెడు బహిర్గతం కాకూడదు. సయీ, ప్రదక్షిణలు చేసేటప్పుడు కొందరు ఇతరులకు బాధ కలిగించడంలో ఏమాత్రం జంకరు. కాని నిజమైన ముస్లిం వైఖరి గురించి ఒక హదీసులో ఈ విధంగా చెప్పడం జరిగింది:

> **ఎవరి నోరు, చేతుల ద్వారా ఇతర ముస్లింలకు హాని కలగకుండా ఉంటుందో అతనే నిజమైన ముస్లిం. (బుఖారి)**

హజ్ సందర్భంగా పోట్లాటలకు, వాగ్వివాదాలకు దిగటాన్ని అల్లాహ్ ప్రత్యేకంగా నిషేధించాడు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి చూడండి:

**ఈ నిర్ణీత మాసాలలో హజ్ చేసే సంకల్పం ఉన్న వ్యక్తి అప్రమత్తుడై ఉండాలి. హజ్ సమయంలో అతడు కామ చేష్టలకూ, దుష్కార్యాలకూ, ఘర్షణలకూ దూరంగా ఉండాలి. (అల్ బఖర-197)**

చివరి హజ్ (హజ్జతుల్‌విదా) సందర్భంగా ప్రతి ముస్లిం, ఇతర ముస్లిం లను గౌరవించాల్సిందిగా మహాప్రవక్త (సఅసం) గట్టి తాకీదు చేశారు. ఆయన ఈ విధంగా సెలవిచ్చారు:

**ఏ విధంగా ఈ నగరంలో ఈ మాసంలో ఈ రోజు నిషేధించబడిందో అదేవిధంగా మీ ధన మాన ప్రాణాలు మీపై నిషేధించబడ్డాయి. (అంటే మీ ధన మాన ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లరాదు).**

కాబట్టి తవాఫ్ చేసేటప్పుడుగాని, మినాలో రాళ్ళు రువ్వేటప్పుడుగాని, ఇతర నియమాలు పాటిస్తున్నప్పుడుగాని ఎలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడకూడదు. అలాగే తోటి యాత్రికులను మాటలతోగాని, చేతలతోగాని బాధించకూడదు. ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే దానివల్ల హజ్ ఉద్దేశ్యమే నిరర్థకమైపోతుంది.

## సయీ

తవాఫ్ నియమాలు ముగించిన తర్వాత మీరు సఫా-మర్వా కొండల మధ్య "సయీ" చేస్తారు. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం హయాంలో ఇవి చిన్న చిన్న కొండలుగా ఉండేవి. సఫా కొండ వైపు ఇబ్రాహీమ్ అలైహిస్సలాం నివాస స్థలం ఉండేది. "ఖుర్బానీ" మర్వా కొండ ప్రాంతంలోనే జరిగింది. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం తన కుమారుడిని జిబహ్ (బలి) చేస్తున్నట్లుగా కలగన్నారు. ఆ కలను ఆయన దైవాదేశంగా భావించి తన కుమారుణ్ణి జిబహ్ చేసేందుకు సిద్ధమయ్యారు. తండ్రి కన్న కలను గురించి విన్న హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం నిర్భయంగా తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు:

**నాన్నగారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని నెరవేర్చండి. అల్లాహ్ తలచుకుంటే మీరు నన్ను సహనశీలునిగా చూస్తారు.**

**(అస్ సాఫ్ఫాత్-102)**

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) తన కుమారుణ్ణి మర్వా కొండ ప్రాంతంలో బోర్లా పండబెట్టి జిబహ్ చేసేందుకు సిద్ధమయ్యారు. అప్పుడు అల్లాహ్ ప్రసన్నుడయి (హజ్రత్ ఇస్మాయీల్‌కు పరిహారంగా) ఒక పొట్టేలును జిబహ్ చేసేందుకు పంపించాడు.

> **తరువాత ఇబ్రాహీమ్ తన కుమారుణ్ణి నుదుటిపై బోరగిల పరుండ బెట్టాడు. అప్పుడు మేము అతన్ని పిలిచి ఇలా అన్నాము: ఇబ్రాహీమ్! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసే వారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. నిశ్చయంగా ఇది ఒక స్పష్టమైన పరీక్ష. మేము ఒక పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించు కున్నాము. (అస్ సాఫ్ఫాత్: 103-107)**

వాస్తవానికి ఖుర్బానీ జరిగిన ప్రాంతం◆ మర్వా కొండ ప్రాంతమే. కాని ఆ తరువాత ఈ ప్రాంతాన్ని మరింత విస్తరిస్తూ 'మినా' ప్రాంతాన్ని కూడా ఖుర్బానీ జరిగిన ప్రదేశంగా నిర్ణయించడం జరిగింది. మహాప్రవక్త (సఅసం) హజ్జతుల్‌విదా సమయంలో మినాలోనే ఖుర్బానీ చేశారు.

హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలాం తన కుమారుణ్ణి జిబహ్ చేసేందుకు మర్వా కొండ వైపునకు అప్రతిహతంగా పురోగమించారు. దీని జ్ఞాపకార్థంగానే హజ్ యాత్రికులు ఇక్కడ "సయీ" చేస్తున్నారు. సయీ అంటే దైవమార్గంలో స్థిరంగా పని చేయడానికి సిద్ధమవడమన్నమాట. అల్లాహ్ పట్ల పూర్తి వినయ విధేయతలతో ఆయన ఆదేశాలు పాటించడంలో ప్రదర్శించే స్థిరత్వం అది. ఉదాహరణకు దైవారాధనలో నిమగ్నులై ఉండడం. ధర్మసంస్థాపనా కార్యంలో

---

◆ హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ను ఆయన తండ్రి హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) బలి (ఖుర్బానీ) ఇచ్చిన సంఘటన 'మనా' ప్రాంతంలోనే జరిగినట్లు హదీసుల్లో గట్టి ఆధారాలున్నాయి. కాని అల్లామా హమీదుద్దీన్ ఫరాహీ (రహ్మాలై) గారు ఈ చారిత్రక సంఘటన 'మర్వా' కొండ ప్రాంతంలో జరిగిందని అనేక సాక్ష్యాలతో నిరూపించారు. 'తౌరాత్'లో ఈ ప్రాంతాన్ని 'మూరహ్' అని వ్యవహరించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు అల్లామా హమీదుద్దీన్ ఫరాహీగారి *"జబీహ్ కౌన్"* అన్న పుస్తకాన్ని చూడగలరు.

ఆఖరి క్షణం వరకు కృషి చేయటం. అవసరమైతే ప్రాణాలను సయితం పణంగాపెట్టి ధర్మాన్ని పరిరక్షించటం.

## ఖుర్బానీ

హజ్రత్ ఇబ్రాహీం (అలై) నెలకొల్పిన ఈ సంప్రదాయానికి జ్ఞాపకార్థం గానే ఖుర్బానీ (బలిదానం) ప్రారంభించబడింది. వాస్తవానికి ఇది ప్రాణ పరిహారం. మన జీవన్మరణాలు అల్లాహ్ ప్రసన్నత కోసమే అనడానికి ఈ బలిదానం పరోక్ష నిదర్శనం.

> **ప్రవక్తా! ఇలా అను: నా నమాజ్, నా సకల ఉపాసనారీతులు, నా జీవనం, నా మరణం సమస్తమూ సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే. (అన్ఆమ్-162)**

ఇబ్రాహీమ్ (అలై) సంప్రదాయమైన ఖుర్బానీ విశ్వాసి జీవిత ధ్యేయాన్ని హజ్ యాత్రికునికి మాటిమాటికి గుర్తుచేస్తుంది. త్యాగనిరతికి సంబంధించిన స్ఫూర్తినిస్తుంది. మీరు మర్వా కొండపై ఎక్కినప్పుడు అక్కడ హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) తన కుమారుణ్ణి బలిగావించిన తీరు మీ కళ్ళ ముందు లీలగా మెదలుతుంది. ఫలితంగా మీలో త్యాగభావం మరింత పెరుగుతుంది. ఈ త్యాగభావం మీలో స్థిరంగా ఉంటే ధర్మసంస్థాపన లాంటి కఠినకార్యం కూడా మీకు అతి సులువైపోతుంది. మనిషి తనకిష్టమైన వస్తువు సాధించడా నికి ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటాడు. ఇలా త్యాగనిరతిని ప్రదర్శిస్తూ అతడు అత్యంత కఠినమైన పని కూడా ఎంతో సులువుగా చేయగలుగుతాడు. మీకు దేవునితో, ఆయన ధర్మంతో పటిష్ఠమైన సంబంధం ఉంటే ధర్మ సంస్థాపనా కార్యకలాపాలన్నీ మీకెంతో తేలికయిపోతాయి. అతి సున్నితమైన సందర్భాలలో సైతం మీరు మేరువు పర్వతంలా స్థిరంగా ఉంటారు.

## దైవనామ స్మరణ

హజ్‌కు సంబంధించిన ఈ నియమాలన్నీ, "మీరు దేవుని దాసులు, దేవుడు మీ ఆరాధ్యనీయుడు" అన్న సంబంధాన్ని మరింత పటిష్ఠం చేస్తాయి.

కాబాగృహం, సఫా-మర్వా కొండలు, ఖుర్బానీ జంతువులు మొదలైనవన్నీ దేవుని చిహ్నాలే. వాటిని చూడగానే మీ దృష్టంతా దైవం వైపు మరలుతుంది. చాలా కాలం తరువాత మీ ప్రాణస్నేహితుని ఇల్లు కన్పించినప్పుడు అతనితో జరిపిన మధుర క్షణాలు మీకు వెంటనే గుర్తుకొస్తాయి. అతడ్ని కలుసుకొని తనివితీరా ముచ్చటిద్దామని మీరు ఎంతో ఉత్సాహపడతారు. అదేవిధంగా మక్కా నగరంలో నెలకొని ఉన్న (దేవుని) చిహ్నాలను చూడగానే దైవనామం మన స్మృతిపథంలో మెదలడం ప్రారంభమవుతుంది. మనసు ఆయన వైపు ఆకర్షించబడుతుంది. ఆ ప్రభువును కలవాలన్న ఉత్సాహం జనిస్తుంది. హజ్ నియమాలు పాటిస్తున్నప్పుడు మనం దైవనామాన్ని జపిస్తూ ఉండాలి. ఒక హదీసులో ఇలా ఉంది:

> **రమీ-జమార్ (రాళ్ళు రువ్వటం), సఫా-మర్వా కొండల మధ్య సయీ చేయటం అనేవి దైవనామ స్మరణార్థమే ప్రారంభించబడ్డాయి.**
>
> **(తిర్మిజీ)**

## ప్రవక్త (సఅసం) పట్ల ప్రేమ

మక్కా నగరంలో విస్తరించివున్న ఇస్లామీయ చిహ్నాలు, ఆ భూభాగం లోని ప్రతి చోటూ మహాప్రవక్త (సఅసం) జీవిత సంఘటనలను గుర్తుచేస్తూ ఉంటాయి. మొట్టమొదట "వహీ" అవతరించిన చోటు సూర్ గుహ. మహా ప్రవక్త (సఅసం) తొలిసారిగా ఖురైషీయులకు దైవసందేశం అందజేసిన ప్రాంతం సఫా కొండ. ఆయన ఏకదైవోపాసన నినాదం లేవనెత్తిన చోటు కాబాగృహం. ఇక్కడ నుండే ఆయన మేరాజ్ యాత్ర ప్రారంభించారు. మక్కా నగరానికి చెందిన ఈ మార్గాల ద్వారానే మహాప్రవక్త (సఅసం) మక్కా వాసులకు దైవసందేశం చేరవేశారు. ఆయనకు కీడు తలపెట్టే ఉద్దేశ్యంతో ఈ మార్గాలలోనే ముళ్ళు, మలినాలు విసిరివేయబడేవి. అయినప్పటికీ మహాప్రవక్త (సఅసం) తనను వ్యతిరేకించిన వారి శ్రేయస్సునే కోరుకునేవారు. వారి శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ 'దుఆ' చేస్తూ ఉండేవారు. ఈ వాస్తవికతను మీరు మక్కా నగర గోడల నుండి ఇప్పటికీ వింటారు. ఈనాడు మనకు లభించిన ధార్మిక సంపద ఆ మహనీయుని (సఅసం) ప్రసాదితమే.

ప్రపంచంలో విస్తరించిన ఇస్లాం కూడా ఆయన కృషికి ఫలితమే. నేడు మన జీవితాల్లో ధర్మపరాయణత, పవిత్రతలు తొణికిసలాడుతున్నాయంటే, ఇవి ఆయన (సఅసం) కఠోరశ్రమ ఫలితమే. నేడు మన హృదయాల్లో ధర్మస్థాపన పట్ల శ్రద్ధాసక్తులు ఉన్నాయంటే అవి ఆయన (సఅసం) అపార త్యాగాల ఫలమే. కనుక ఆ మహోపకారి, మహామనీషి మనందరి దృష్టిలో అందరికంటే ఎక్కువ ప్రియమైనవాడయి ఉండాలి. ఆయన (సఅసం) పట్ల మనం ఎంతగా ప్రేమాభిమానాలు పెంచుకుంటామో, ఆయన (సఅసం) అడుగుజాడల్లో నడవడం మనకు అంతే సులువైపోతుంది. మహాప్రవక్త (సఅసం) సంప్రదాయా లను ఆచరించే పని ఆయన పట్ల మనకుండే ప్రేమాభిమానాలపైనే ఆధారపడి ఉంటుంది.

అదేవిధంగా మీరు మదీనా నగరాన్ని సందర్శించినట్లయితే, నేరుగా మహాప్రవక్త (సఅసం) కొలువుకు చేరుకున్నామన్న భావన కలుగుతుంది మీలో. అప్పుడు ఆ మహనీయుని (సఅసం) పట్ల మీకుండే ప్రేమాభిమానాలు దరూద్-సలాం రూపంలో మీ నోట అప్రయత్నంగా వెలువడుతాయి.

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదివ్ వఅలాఆలి ముహమ్మదివ్ వఅలా ఆలిహీ వ అస్హాబిహీ వ బారిక్ వ సల్లిమ్.**

## హజ్ మార్గంలో ఎదురయ్యే అవరోధాలు

మీరు మక్కా నుండి మనా వరకు, తిరిగి మనా నుండి అరఫాత్ వరకు వెళ్తారు. మరల అరఫాత్ నుండి ముజ్దలిఫాకు, ముజ్దలిఫా నుండి మనాకు వస్తారు. అక్కడ కొన్ని రోజులపాటు మీరు ఆగవలసి ఉంటుంది. అది పూర్తిగా ఎడారి ప్రాంతం. అక్కడి వాతావరణం కూడా చాలా బాధాకరంగా ఉంటుంది. అయినా అల్లాహ్ ఈ ప్రాంతాన్నే ఎంపిక చేశాడు. అల్లాహ్ సన్నిధికి చేరుకునే మార్గం కఠినంగానే ఉంటుంది. కాబట్టి దైవసాన్నిధ్యం కోరుకునే వారు బాధలు సహించక తప్పదు. అవరోధాలు అధిగమించక తప్పదు. ఎలాంటి త్యాగానికైనా వెనుదీయకూడదు. పరిస్థితులకు ఎదురీదవలసి ఉంటుంది. ప్రతికూల విషయాలు విధినిర్వహణలో అవరోధాలుగా ఉండ

కూడదు. అకుంఠిత కార్యదీక్షతో ముందుకు అడుగు వేయవలసి ఉంటుంది. అప్పుడే దేవుడు మీకు చేయూతనిస్తూ అడుగడుగునా మార్గదర్శనం చేస్తాడు. ఈ విధంగా ఆ ప్రభువు కరుణాకటాక్షాల చల్లని నీడ మీపై పడగానే మీకు దైవసాన్నిధ్యం లభించినట్లుగా, అత్యున్నత స్థానం పొందినట్లుగా మీరు అనుభూతి చెందుతారు. ఆ స్థానమే శాశ్వతమైన సుఖసంతోషాల నిలయం.

## హజ్ ప్రభావం

బఖరా సూరాలో హజ్ నియమాలు తెలియజేసిన తరువాత అల్లాహ్ విశ్వాసి గుణగణాలను ఇలా పేర్కొన్నాడు:

> **'మానవుల్లోనే మరొకడు అల్లాహ్ సంతోషం పొందడానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేస్తాడు. అటువంటి తన దాసుణ్ణి అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. విశ్వసించిన ప్రజలారా! మీరు పూర్తిగా ఇస్లాంలో ప్రవేశించండి. షైతాను అడుగుజాడలు త్రొక్కకండి. అతడు మీకు బహిరంగ శత్రువు." (అల్ బఖర: 208-209)**

దీన్నిబట్టి నిజమైన విశ్వాసి హజ్ ద్వారా ప్రభావితమై తన పూర్తి జీవితాన్ని దైవప్రసన్నత కోసం అంకితం చేస్తాడు. జీవితంలోని ప్రతి రంగంలో (ఉదా: నైతిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో) దైవాదేశాలకు కట్టుబడి ఉంటాడు. తిరస్కార వైఖరి అవలంబించడు. తన పూర్తి జీవితాన్ని ఇస్లామీయ జీవనపథంలో పయనింపజేస్తాడు. ధర్మ ప్రచారానికి, ధర్మ పరివ్యాప్తికి తగిన సహాయ-సహకారాలు అందిస్తాడు. ధర్మసంస్థాపనలో ఆచరణాత్మకంగా కృషి చేస్తాడు. దేవునికి ఆగ్రహం తెప్పించే, షైతాన్‌కు సంతోషం కలగజేసే చేష్టలకు దూరంగా ఉంటాడు.

అల్లాహ్ మనందరికీ తన ప్రసన్నతాభాగ్యం కోసమే జీవించే, మరణించే సద్బుద్ధి ప్రసాదించుగాక! (ఆమీన్- సుమ్మ ఆమీన్)

**-: సమాప్తం :-**